# గళంలోని గరళం

## 9

సరళ యెక్కింది, రైలు కదిలింది. దారిలోనే పడేశాడు కూలీ వాడు సామాను. పెట్టె, బెడ్డింగ్ కంపార్టుమెంటు లోపలిదాకా యీడ్చుకు వచ్చింది. హోల్డాలు విప్పి. లోపల్నుంచి ఒక దిండు లాగి పైన పడేసి, చెప్పులు కింద విడిచింది. తాపీగా దిండు నానుకుని కూర్చుని ఎదురుగా చూసింది.

కంపార్టుమెంటు చాలా చిన్నది. తనతోటి ప్రయాణీకు లెవరోనని ఎదురుగా కూర్చున్నవాళ్ళవంక పరీక్షగా చూసింది సరళ. ఇద్దరు ఆడ వాళ్ళూ, తనూ మాత్రమే వున్నారు ఆ కంపార్టుమెంటులో. ఒకావిడకి యాభై ఏళ్ళు పైబడ్డాయి. రెండోఆవిడకి ముప్ఫైఐదు ఏళ్ళు వుంటాయి. వాళ్ళిద్దరూ అప్పాచెల్లెళ్ళు కావచ్చు. చిన్నావిడ ముఖం అందంగానే వుంది. ఆవిడ వంటినిండా నగలున్నాయి. ఖద్దరు సిల్కుచీరె కట్టుకుంది. రెండోఆవిడకి యింకా ఎక్కువగానే వున్నాయి నగలు. ఆవిడో గుంటూరు నేత జరీచీరె కట్టుకుంది. ఇద్దరూ కిటికీలోంచి బైటికి చూస్తు న్నారు. సరళ చాలసేపు వాళ్ళిద్దరివంకా చూసింది. కాని వాళ్ళల్లో ఒక్కళ్ళుకూడా తల తిప్పి ఆమెవంక చూడలేదు. ఈ సంగతి సరళను కొద్దిగా నిరుత్సాహపరచిన మాట వాస్తవమే.

సరే, తలకాయ తిప్పేసి తనుకూడా బైటికే చూడసాగింది సరళ. రైలు చాలా స్పీడుగా పోతోంది. రైలు కుదుపుకి మెల్లిగా లయతో వూగుతోంది సరళ శరీరం. సూర్యాస్తమయ సమయం, బయళ్ళు, దూరానున్న నీలినీలి మబ్బులు అన్నీ సువర్ణ కాంతిమయంగా గోచరిస్తు న్నాయి. అక్కడక్కడున్న చెట్లు, పొదలు వెనక్కి పరుగెత్తుకు పోతు న్నాయి. కాని వాటివంక చూస్తూ ఏదో వూహాప్రపంచంలో మునిగి పోయేంత భావుకురాలు కాదు సరళ.

ఏంతోచక మళ్ళీ ఎదురుగావున్న యిద్దరివంక చూసింది. వాళ్ళల్లో పెద్దావిడ సరళవంక ఒక్క_క్షణం చూసి తల తిప్పేసుకుంది. సరళ తన వాచీ చూసుకుని, అనవసరంగా చేతినుంచి తీసి 'కీ' యిచ్చింది. ఈ మోతకి రెండో ఆవిడ తలతిప్పి సరళవంక, ఆమె వాచీవంక చూస్తూ కూచుంది చాలా సేపు.

సరళకి యీ చూపు కాస్త యిబ్బందిగానే వున్నా ఆనందంగానే వుంది. షిఫానుచీరె పమిట జారిపోతుంటే, నిండుగా కప్పుకుంది. ఆవిడ వంక చూడటం లేదుకానీ. ఆవిడకళ్లు తన మీద వున్నట్లు తెలుసు సరళకి. పమిట కొంగుమీద వున్న అందమైన ఎబ్రిడిజైను వంక చూసుకుంది ఓ మాటు. అప్రయత్నంగా ఎఱ్ఱరాళ్ల ఉంగరాన్ని కుడిచేతి నుంచి ఎడమ చేతికి మార్చింది.

ప్రయాణంలో—అందులోనూ యింత చిన్న కంపార్టుమెంటులో— యిద్దరుముగ్గురే వుంటే సంభాషణ సాగితీరాలి. ఎవరో ఒకళ్లు ముందు పలుకరించాలి. సాధారణంగా పెద్దవాళ్లు పలుకరిస్తారు చిన్న పిల్లలను. పదినిముషాలు నిశ్శబ్దంగా సాగడమే అసంభవంగా, దుర్భరంగావుంది సరళకి. అందులోనూ ఎదటివాళ్ళు తనవంకన్నా చూడటంలేదు. మహా

యిబ్బంది పడిపోతున్నట్లుగా మొహం ముడుచుకుని, మెడవంచి ఓమాటు రాళ్ళనెక్లెసు సవరించుకుంది. ఒక పెద్ద నిట్టూర్పు విడిచింది.

సరళకి పదహారేళ్ళు. ఇంటరు రెండో సంవత్సరం చదువుతోంది. అది వాళ్ళవూళ్ళో, కాలేజీలో, స్నేహితులలో చాలా అబ్బురమైన విషయం. బంధువుల్లో అంతా ముక్కుమీద వేలేసుకునేవాళ్లే. " అప్పుడే ఎఫ్. ఏ. నా? " అని. అదోగర్వం సరళకి. ఎన్నిమాట్లో ప్రయాణాల్లో ఎవరో ఒకరు " ఏం చదువుతున్నావమ్మాయి " అని అడగడం, తను ఇంటరనగానే ఎంతో ఆశ్చర్యపడిపోవడం సరళ ఎరుగుంది.

కాని—ఈ ప్రయాణం ఏదో విరుద్ధంగా వుంది. మెల్లిగా మోచేతి మీదలేచి బెడ్డింగులోంచి ' అగథా క్రిస్టి ' నవల ఒకటి తీసింది. ఆమధ్య నాన్నగారు కొనిచ్చారది. మొదలెట్టి అర్థంకాక విసుగుపుట్టి మానేసింది. కాని యిప్పుడు తీయాల్సి వచ్చింది.

ముఖానికడ్డంగా పుస్తకం పెట్టుకుని, దీక్షగా చదవసాగింది సరళ. ఆ ఆడవాళ్ళిద్దరూ తనవంక చూస్తున్న సంగతి ఆమె వెంటనే పసికట్టేసింది. మరింత దీక్షగా, వూపిరి బిగబట్టేసి గబగబ చదవసాగింది "వీళ్ల అడుగుతారింక. తప్పదు. 'ఏవూరు వెడుతున్నావు'తో మొదలెట్టి. చదువు, తల్లిదండ్రులు, పెళ్ళివివరం అన్నీ అడుగుతారు." చిన్న చిరునవ్వు వచ్చింది సరళ ముఖాన. పేజీ తిరగేసింది.

ఇంతకీ—కిందటి పేజీలో ఒక్క ముక్క అర్థంకాలేదన్న సంగతి జ్ఞాపకం వచ్చింది సరళకి. పుస్తకం పేరేమిటి? అనుకుని అట్టవేపు చూసింది. ' మర్డర్ ఇన్ మెసమెపొటోమియా ' అని చదివింది. ఇదే మిటని మళ్ళీ ఓమాటు చూసింది. ' మెసపోటోమియా! ' అని కూడ బలుక్కుని చదివింది.

హఠాత్తుగా మాట్లాడ్డం మొదలెట్టారు సరళ ఎదురుగా కూర్చున్న వాళ్ళు.

"మీ గేదె యీనిందా ?" అన్నది చిన్నావిడ.

"లేదు వదినా. పెరుగుకి చాలా యిబ్బంది పడిపోతున్నాము." సరే. పల్లెటూరిసజ్జు అనుకుంది సరళ. మళ్లీ వాళ్లవంక చూస్తూ కూచుంది ఆమె.

ఒక్కనిముష మైనాక పెద్దావిడ పలుకరించింది, "మరి వదినా! సత్యానికి గుంటూరులో పని దొరికిందటగా ?"

"ఔను. వాడి తల్లి అదృష్టమంతాను. పాపం, అష్టకష్టాలు పడి కడుపులో పెట్టుకుని పెంచిందావిడ. ఫలం దక్కింది. ఆవిడ సుఖపడు తుందిలే ఇంక" అంది చిన్నావిడ, నిర్లిప్తంగా సరళ పుస్తకం మీది బొమ్మవంక చూస్తూ.

"ఏం ఉద్యోగమో! గుంటూరులో, యెండకాలంలో ఉంటే ప్రాణం కడగట్టిపోతుంది బాబూ" అంది పెద్దావిడ.

సరళ ఓపిక సన్నగిల్లుతోంది. వీళ్ల తోటి వాళ్ళతో మాట్లాడ రేమిటి? సరళ అహం దెబ్బ తింటున్నట్లుగా వుంది. గిలగిలలాడి పోయింది సరళ—తను యింటరు చదువుతున్నాననీ, సంగీతం బాగా వచ్చుననీ, తనకి ఎస్. ఎస్. ఎల్. సి. లో స్కూలు మొత్తంమీద ఫస్టు మార్కనీ—చెప్పుకుందామని.

ఇంగ్లీషు పుస్తకం చదువుతోంది. రిస్టువాచి పెట్టుకుంది. బూట్లు తొడుక్కుంది. ఖరీదైన చీరె. నగలు వున్నాయి. ఏదో ఒకటి అడగరేం? వాళ్లల్లో వాళ్లు గొణుక్కోకపోతే ఓ ప్రశ్న వేయరాదూ? బొత్తిగా

ఆసక్తి లేదేం వీళ్లకి? సరళకి అనవసరంగా కోపం వచ్చింది వాళ్లమీద. స్నేహాలు కలిపేసుకుని, టిఫిన్లు, కాఫీలు ఒకళ్ల కొకళ్లు యిచ్చేసుకుని, అమాంతం ప్రాణం యిచ్చేటంతగా దగ్గరైపోతారు కొందరు ప్రయాణాల్లో. గంటన్నర గడచినా, నాలుగు స్టేషన్లు దాటినా వీళ్ళకి ఎదురుగా కూచున్న అందమైన ఒంటరి చిన్నదాని సంగతి పట్టనే లేదు.

ఇద్దరి వంకా చూస్తూ కూచుంది ఎంతసేపో ఆమె. వాళ్లూ చూశారు గుడ్లెట్టుకుని, కాని మాట్లాడలేదు. రైలు స్పీడు తగ్గుతోంది. స్టేషను వస్తోంది. ఉండబట్టలేకపోయింది సరళ. ఛీ! ఏం మనుష్యులు!

"ఏవూరెడుతున్నారు?" అంది చిన్నావిడవంక చూసి సరళ ఎంతో ఆత్రం ఆ ప్రశ్నలో!

"ఇక్కడే" అంటూ ఆవిడలేచి సంచి చేత్తో పుచ్చుకుని లేచి, ఆవలించి చిటికె వేసింది. కుచ్చెళ్ళు సరిచేసుకుని తలుపు సమీపించారిద్దరూ. రైలు ఆగింది పెద్దస్టేషన్లో. ఇద్దరూ దిగి, ప్లాటుఫారందాటి మెట్లుయెక్కి బ్రిడ్జిమీద ఎక్కారు. సరళ కిటికీ దగ్గరకొచ్చి నడిచిపోతున్న వాళ్ళిద్దరివంకా చూసింది. అల్లా నడిచి జనంలో కలిసిపోయి, కనుపించకుండా పోయారిద్దరూ.

సరళ మనస్సు అదోలా వుంది. వాళ్ళను కేకేసి "ఏమండోయి నేనింటరు చదువుతున్నాను. నాకు పదహారేళ్లే!" అని అరవాలనిపించింది సరళ గొంతులో ఏదో వేదనలాగా బయలుదేరి, మింగినా లోపలికిపోక, ఏడుపుగా పైకిరాక మిగిలిపోయింది. రైలుకదిలింది. [1956]